క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి పనుల వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

మక్కువ: మండలంలోని కాశీపట్నం, మార్కొండపుట్టి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను కేంద్ర బృందం సోమవారం పరిశీలించింది. కేంద్ర బృందం సభ్యులు ఎం.కె.శశి ఆపన్, కేజీ సలీమ్‌కుమార్ ఆయా పంచాయతీల్లో పర్యటించి ఉపాధి నిధులతో చేపట్టిన పనులు, వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు, మహిళా సంఘాల సభ్యులు, వీఓలతో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ, ఏపీడీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఎన్.రమేష్ రామన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణ పరిధిలోని ప్రధాన నీటి సరఫరా కేంద్రం నుంచి పంపింగ్ చేసే ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులకు గురైనందున మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాడు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని కమిషనర్ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్ మరమ్మతు పనులు పూర్తచేసి ప్రజలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

కమిషనర్ పర్యటన



వార్డుల్లో చేపడుతున్న విద్యుద్దీకరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

సాలూరు: పట్టణంలో 28, 29 వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ సోమవారం పర్యటించారు. ఆయా వార్డుల్లో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగకపోవడాన్ని గుర్తించారు. వెంటనే వాటికి మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది కొత్త లైట్లు ఏర్పాటు చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఆర్టీసీ డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఈఎస్‌కే దుర్గ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం ఆర్టీసీ డిపో పరిధిలో గుర్తించిన సమస్యలను 9959225621 నంబర్‌కు కాల్ చేసి తమకు తెలియజేయాలని కోరారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సంస్థ అభివృద్ధికి ప్రజలు సలహాలు అందజేయాలని ఆమె కోరారు.

బాధ్యతల స్వీకరణ


ప్రసన్నకుమార్, తహసీల్దార్

సీతానగరం: మండల తహసీల్దార్‌గా కె.ప్రసన్న కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జె.రాములమ్మకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో విశాఖ జిల్లా నుంచి వచ్చిన కె.ప్రసన్నకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఇదే సమయంలో బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ రాములమ్మకు వీడ్కోలు పలికారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రజలు, రెవెన్యూ సిబ్బంది సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తానన్నారు.

వృత్తి విద్యతో ఉజ్వల భవిష్యత్

- జీసీడీఓ శ్రీనివాసరావు


బైక్ మెకానిజంపై విద్యార్థులకు ఇస్తున్న శిక్షణను పరిశీలిస్తున్న జీసీడీఓ శ్రీనివాసరావు

వీరఘట్టం: వృత్తి విద్య ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా జీసీడీఓ బి.శ్రీనివాసరావు అన్నారు. పీఎంశ్రీ పథకానికి ఎంపికైన స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు దసరా సెలవుల్లో వృత్తి విద్యపై ఇస్తున్న శిక్షణను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పాఠశాలలో అన్ని పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ఓ ప్రైవేట్ బైక్ మెకానిక్ వద్ద ఇస్తున్న శిక్షణను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే బాలికలకు టైలరింగ్‌లో ఇస్తున్న శిక్షణను కూడా పరిశీలించారు. శిక్షణను బాల, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ వై.హరిప్రసాద్, ట్రైనర్ టి.ఈశ్వరి, ఆర్.కుమారి, తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న సేవా కేంద్రాలు

- సచివాలయాల్లో సేవలను కుదిస్తున్న కూటమి ప్రభుత్వం
- ఒక్కొక్కటిగా నిలిచిపోతున్న సేవలు
- ఓపెన్ కాని ప్రభుత్వ సైట్లు
- కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల మంజూరుకు ఆటంకం
- ప్రజలకు తప్పని అవస్థలు


బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామ సచివాలయం

పార్వతీపురంటౌన్: గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా సుమారు ఐదు వందలకు పైగా ప్రభుత్వ సేవలు గ్రామస్థాయిలోనే ప్రజలకు అందేవి. ప్రజలకు ఏ అవసరం వచ్చినా గ్రామ వలంటీర్ల ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే పని పూర్తయ్యేది. స్థానిక సమస్యల పరిష్కారంలో సచివాలయాలు కీలకపాత్ర పోషించాయి. ప్రజా సేవా కేంద్రాలుగా ఉన్న సచివాలయాలు కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యమయ్యాయి. సర్వర్లు తరచూ మొరాయిస్తుండటంతో ప్రభుత్వ వెబ్‌సైట్లు ఓపెన్ అవ్వడం లేదు. కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆయా సైట్లు ఓపెన్ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సచివాలయ ఉద్యోగులే దిక్కు..

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు సచివాలయ వ్యవస్థపై అడ్డగోలుగా విమర్శలు చేశారు. సచివాలయాలు ఎందుకు? అవి అసలు ఉద్యోగాలే కాదంటు అవహేళన చేశారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ ఉద్యోగులతోనే పింఛన్లు పంపిణీ చేస్తోంది. సచివాలయాల్లో సేవలను కూటమి ప్రభుత్వం పూర్తిగా కుదించింది. ఈ ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించే పని అప్పగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రభుత్వ శాఖలపై, క్షేత్రస్థాయిలో ప్రజల స్థితిగతులపై అవగాహన కలిగిన సచివాలయ ఉద్యోగులను ఎలా వినియోగించుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు వేల జనాభాకు ఒక సచివాలయం

రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం చొప్పున జిల్లాలో సుమారు 350 గ్రామ, వార్డు సచివాలయాలను నిర్మించారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.40 లక్షలు చొప్పున ఖర్చుచేశారు. ఒక్కో సచివాలయంలో సుమారు 9 మంది చొప్పున 3200 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. సుమారు ఐదు వందలకు పైగా ప్రభుత్వ సేవలను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించేవారు. గత ఐదేళ్ల పాటు ప్రభుత్వం అమలు చేసిన వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు లబ్ధిదారులకు పథకాలు చేరవేడయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కీలకంగా పనిచేశారు. వివిధ ప్రభుత్వ సేవలు పొందేందుకు వచ్చే ప్రజలతో సచివాలయాలు సందడిగా కనిపించేవి.

వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు



ప్రస్తుతం కొత్తగా పింఛన్లు, రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. వెబ్‌సైట్ ప్రారంభమైన వెంటనే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాం. వెబ్‌సైట్ ఓపెన్ అయితే గ్రామాల్లో అర్హులైన వారికి సమాచారం అందజేస్తాం.

– రామచంద్రరావు, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి, పార్వతీపురం

ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిరుపయోగంగా..

కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కొత్తగా ఒక్క పింఛన్, రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఎలాంటి సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ సేవల కోసం మీసేవా కేంద్రాలు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. గతంలో ప్రజలతో నిత్యం కళకళలాడే సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. గత ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన శాశ్వత భవనాలు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

నకిలీ విత్తనాలు అమ్మినవారిపై చర్యలు తీసుకోవాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కేసులు పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్కువ మండల కేంద్రంలో ఉన్న వ్యాపారస్తులు కొంచాడ శ్రీనివాసు, గ్రంధి గున్నరాజు ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు మొక్కజొన్న విత్తనాల విక్రయించారని అన్నారు. నంద గ్రామంలో 13 మంది రైతులు వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేసి సుమారు 20 ఎకరాల్లో విత్తనాలు వేయగా.. మెలకలు వచ్చినప్పటికీ మొక్కల్లో పెరుగుదల లేక గిడసబారిపోయాయన్నారు. ఎకరానికి సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టారని, మొక్కలు గిడసబారిపోయి ఎదుగుదల లేకపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. గిరిజనులకు విత్తనాలు అమ్మిన సందర్భంలో సదరు వ్యాపారస్తులు రశీదులు కూడా ఇవ్వలేదని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. అధికారులు స్పందించి సదరు వ్యాపారులపై చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మక్కువ మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు ఇచ్చిన హామీ అమలు చేయాలి


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు, సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: గ్రామ, వార్డు వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వలంటీర్లతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు చేరవేసేందుకు వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చిందన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధులుగా ఉంటూ ఐదేళ్లుగా సేవలందించారని అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా వలంటీర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వారిని మోసం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వలంటీర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు వి.ఇందిర, సంపూర్ణ, సీఐటీయూ నాయకులు బంకుర సూరిబాబు, వలంటీర్లు కె.అప్పారావు, కరుణాకర్, రమేష్, నాయుడు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి అలంకరణలో పోలమాంబ


మక్కువ: లక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న పోలమాంబ అమ్మవారు


సాలూరు: కుంకుమ అలంకరణలో కామాక్షమ్మ తల్లి

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారు సోమవారం లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ వి.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో చదురుగుడి వద్ద వేదపండితులు కె.శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సాలూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన సోమవారం అమ్మవారు మహాచండీగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలో, గ్రామాల్లో ఏర్పాటు చేసిన దేవీ మండపాలు, ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాలూరు కామాక్షమ్మ వారిని కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించారు.


మక్కువ: పూజల్లో పాల్గొన్న మహిళలు

పండగ పూట స్వచ్ఛత నై..


కొత్తవీధి కూడలి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

పాలకొండ రూరల్: పట్టణంలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో అన్ని వార్డుల్లో సంబరాలు కొనసాగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి భక్తులతో పాటు బంధువులు పాలకొండ చేరుకున్నారు. అయితే ప్రధాన వీధుల్లో పారిశుధ్యం లోపించడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పండగ పూట కూడా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణ


గరుగుబిల్లి: సూచనలిస్తున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు

సీతంపేట: స్థానిక వైటీసీలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు సోమవారంశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన, గ్రామసభల నిర్వహణ, తాగునీటి సమస్య పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, డివిజనల్ పంచాయతీ అధికారి రామ్‌ప్రసాద్, ఎంపీడీఓ గీతాంజలి, ఈఓపీఆర్‌డీ సత్యం, ఏఓ మాస, ఎంఈటీలు సుదర్శనరావు, పాపారావు, రాజశేఖరం, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఉపసర్పంచ్‌లే కీలకమని ఈవోపీఆర్‌డీ గోపాలరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు సోమవారం నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు ఏ విధంగా వేసుకోవాలి, గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలని, నిధుల సద్వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలుచేస్తే గ్రామ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధాన్యం తూకంలో మోసం..

వీరఘట్టం: రైతులను మోసం చేసేందుకు వ్యాపారుల తమదైన శైలిలో ఎగబడుతున్నారు. ముఖ్యంగా ధాన్యం తూకంలో ఎల్రక్టానిక్ కాటాలు వినియోగిస్తూ తప్పుడు తూకం తూస్తున్నారు. 80 కిలోల బస్తా పేరుతో 85 కిలోలు తూస్తూ రైతులను మోసం చేస్తున్నారు. విషయం రైతులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని నీలానగరం, తదితర ప్రాంతాల్లో సోమవారం ధాన్యం వ్యాపారులు పంటను కొనుగోలు చేశారు. అయితే ఎల్రక్టానిక్ కాటాల ద్వారా సులువుగా మోసం చేసే అవకాశం ఉండడంతో వ్యాపారులు వాటినే వినియో గిస్తున్నారు. అధికారులు ఇటువంటి కాటాలపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధుల సహకారంతో పంచాయతీల అభివృద్ధి


మక్కువ: మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపరాణి


సీతానగరం: మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

మక్కువ: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీవో డి.స్వరూపరాణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నిధుల ఖర్చు విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి.దేవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్లు గ్రామాభివృద్ధికి కృషి చెయ్యాలి

సీతానగరం: గ్రామ పంచాయతీలను బలోపేతం చేసేందుకు, సామాజిక సమస్యల పరిష్కారానికి ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు కృషి చేయాలని ఎంపీపీ బి.రవణమ్మ, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన పంచాయతీ వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రతీ పంచాయతీ నుంచి ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లు చొప్పున ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్, వార్డు మెంబర్ల విధులు, బాధ్యతలపై రిసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు చేరవేయడంతో పాటు గ్రామాభివృద్ధిలో వార్డు మెంబర్లు కీలక భూమికను పోషించాలని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పంచాయతీ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మహాచండీ అలంకరణలో..


పార్వతీపురంటౌన్: మహాచండీ అలంకరణలో కొత్తవలస దుర్గమ్మ


బలిజిపేట: అజ్జాడలో మహాచండీగా పూజలందుకుంటున్న అమ్మవారు

పార్వతీపురంటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కొత్తవలసలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు సోమవారం మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే వైకేయం వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

అజ్జాడలో..

బలిజిపేట: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అజ్జాడ గ్రామంలోని విజయదుర్గాభవానీ ఆలయంలో సోమవారం అమ్మవారిని మహాచండీగా అలంకరించి పూజలు చేశారు. అర్చకులు బి.రామలింగస్వామి, ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అమెరికా అండతోనే గాజాపై ఇజ్రాయిల్ దాడులు


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

- యుద్ధం విరమించాలని కాంక్షిస్తూ వామపక్షాల సంఘీభావ ర్యాలీ

పార్వతీపురంటౌన్: అమెరికా అండతో గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు ఆపాలి వామపక్ష జిల్లా నాయకులు కూరంగి మన్మథరావు అన్నారు. ఈ మేరకు వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, లిబరేషన్ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం పార్వతీపురం పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాలో తలెత్తిన సంక్షోభం, నిరుద్యోగ సమస్య నుంచి కాపాడుకోవడానికి ప్రపంచం దేశాల్లో అమెరికా యుద్ధాలను సృష్టించడంతో పాటు ఆయుధాలను సరఫరా చేసి ఆజ్యం పస్తోందని ఆరోపించారు. గాజాలో స్కూళ్లు, కాలేజీలు, ఆస్పత్రులు, దేవాలయాలు, చర్చిలు, మసీదులపై ఇజ్రాయిల్ దాడులు చేస్తూ మారణహోమం సృష్టిస్తోందన్నారు. గత అక్టోబర్ 7 ప్రారంభించిన ఈ దాడులు విరమిస్తామని చెపుతూనే కొనసాగిస్తోందన్నారు. ఇజ్రాయిల్ గాజా, పాలస్తీనాపై చేస్తున్న దాడులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో బొచ్చ నర్సింగరావు, ఎం.భాస్కరరావు, పి.భాస్కరరావు, రెడ్డి వేణు, పి.సంగం, రమణి, దుర్గాదేవి, బి.సూరిబాబు, బుడితి అప్పలనాయుడు, సూరయ్య కుమార్, పి.శ్రీనునాయుడు, సర్వేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, కూరంగి ప్రసాద్, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.